క్లుప్తంగా

జూదరుల అరెస్ట్



పోలీసులు అదుపులోకి తీసుకున్న జూదరులు

ఏలూరు రూరల్: పెదవేగి మండలం నడిపల్లి గ్రామం వద్ద పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నామని ఎస్‌ఈబీ ఏలూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 5 సెల్‌ఫోన్లు, 5 మోటార్ సైకిల్స్, 52 పేకముక్కలు, రూ.10,750 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. వీటిని పెదవేగి పీఎస్‌లో అప్పగించామని తెలిపారు. ఎస్సై పి.సుబ్బిరెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారని వివరించారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిధిలో ఖాళీగా ఉన్న 22 వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. గుడివాకలంకలో 2, తంగెళ్లమూడిలో 2, పోణంగిలో 3, శనివారపుపేటలో 5, వెంకటాపురంలో 8, కొమడవోలు, చాటపర్రులో ఒక్కొక్కటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అభ్యర్థులు ఈ నెల 23 నుంచి జులై 2వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జులై 3న దరఖాస్తుల పరిశీలన, 4న అభ్యర్థుల మౌఖిక పరీక్ష, 5న ఎంపికైన వలంటీర్ల వివరాల వెల్లడి, 6న శిక్షణ, 8వ తేదీ నుంచి విధుల్లోకి చేరాల్సి ఉంటుందని వివరించారు.

డీఈఎల్ ఈడీ పరీక్షలకు 51 మంది గైర్హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ ఈడీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 67 మందికి 16 మంది హాజరు కాగా 51 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసలు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ తెలిపారు.

26న పోలవరంలో బహిరంగ సభ

ఏలూరు (టూటౌన్): పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి, ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి ఈ నెల 26న మధ్యాహ్నం పోలవరంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వాసితుల నష్టపరిహారంపై ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాజ్యసభ సభ్యులు పి.సంతోష్‌కుమార్, సీపీఎం రాష్ట్ర నాయకులు పి.మధు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

సాగుకు సమాయత్తం

- పంట చేలకు చేరిన నీరు
- దుక్కిదున్ని, విత్తనాలు చల్లే పనిలో రైతులు
- అందుబాటులో సబ్సిడీ విత్తనాలు



చొదిమెళ్లలో బోర్లు కింద నారుమడి వేసిన రైతు

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో రైతులు ఖరీఫ్ వరిసాగు పనులు ప్రారంభించారు. కృష్ణా కెనాల్ నుంచి సాగునీరు విడుదల కావడంతో రైతుల్లో ఉత్సాహం వెల్లువిరుస్తోంది. మరోపక్క రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు చేలల్లో నీరు చేరుతోంది. మల్కాపురంలో సాగుదారులు ట్రాక్టర్లతో దుక్కిదున్ని నేలను చదును చేస్తున్నారు. చొదిమెళ్లలో బోర్లు కింద సాగు చేస్తున్న రైతులు విత్తనాలు చల్లుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

కృష్ణా కెనాల్ నుంచి నీరు విడుదల

రెండు రోజుల క్రితం ఇరిగేషన్ అధికారులు కృష్ణా కెనాల్ నుంచి విడుదల చేసిన సాగునీరు శుక్రవారం ఏలూరు చేరింది. ఇరిగేషన్ ఏఈ సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు లస్కర్లు పాండురంగా థియేటర్ వద్ద జాలిపూడి డ్రెయిన్ నుంచి మాదేపల్లి, జాలిపూడి, కాట్లంపూడి గ్రామాలకు నీటిని విడుదల చేశారు. ఇదే క్రమంలో పెద్ద రైల్వే స్టేషన్, తూర్పులాకుల వద్ద స్లూయిజ్ నుంచి మల్కాపురం, కొమడవోలు, చాటపర్రు తదితర గ్రామాలకు వదిలారు. గ్రీన్ సిటీ, ఎన్టీఆర్ కాలనీ తదితర స్లూయిజ్ నుంచి పోణంగి పరిసర ప్రాంతాల్లో పంటచేలకు సాగునీరు చేరింది. పడమట లాకుల నుంచి విడుదల చేస్తున్న నీరు పోణంగి ఎగువ ప్రాంతాలకు పారుతోంది.

అన్ని గ్రామాల్లోనూ వరిసాగు

మండలంలో ఈ ఏడాది రబీలో సాగునీరు లభ్యత లేకపోవడంతో అధికారులు సూచనల మేరకు రైతులు 6,223 ఎకరాల్లో వరితో పాటు అపరాలు సాగు చేశారు. ఇందులో చాటపర్రు, మాదేపల్లి, కాట్లంపూడి, జాలిపూడి ప్రాంతాల రైతులు 4,549 ఎకరాల్లో అపరాలు మాత్రమే పండించారు. వెంకటాపురం, చొదిమెళ్ల, తంగెళ్లమూడి, సత్రంపాడులో బోర్లు కింద 1,674 ఎకరాల్లో మాత్రమే వరిసాగు చేశారు. ఇప్పుడు అన్ని గ్రామాల్లోనూ రైతులు వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.



చొదిమెళ్ల ఆర్బీకే నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

సబ్సిడీపై విత్తనాలు సిద్ధం



ఈ ఏడాది ఖరీఫ్‌లో ఏలూరు మండలంలో 8 వేల నుంచి 9 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆర్బీకేల్లో 1061, 1318, స్వర్ణ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. కేజీకి రూ.5 చొప్పున రైతులకు సబ్సిడీ వస్తుంది. సేంద్రియ ఎరువులు సైతం అందిస్తాం. ఈ ఏడాది రబీలో 133 మంది రైతులు రూ.11.81 లక్షలు ఖరీదు గల విత్తనాలను ప్రభుత్వం నుంచి సబ్సిడీ ధరకు కొనుగోలు చేశారు.

– ఎ.జీవనసంధ్య, ఎంఏఓ

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



25వ సచివాలయంలో సురక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాసరావు



15వ డివిజన్‌లో సురక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కార్పొరేటర్ రాము

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులైన ప్రజలందరికీ మేలు చేయాలని ఏలూరు డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 79 సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సురక్ష విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఏలూరు 35వ డివిజన్‌లోని 25వ సచివాలయంలో జగనన్న సురక్షలో భాగంగా ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌కు డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు హాజరయ్యారు. ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో సీఎం జగన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కొవ్వాడ వనిత, గృహ సారథులు కాగాని అచ్చిబాబు, కొత్తల చంద్రశేఖర్, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, సీఆర్‌పీలు హాజరయ్యారు.

15వ డివిజన్‌లో కార్పొరేటర్ తంగెళ్ల రాము జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరయ్యారు. సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు హాజరై సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. 18వ డివిజన్‌లోని 39, 40 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. కార్పొరేటర్ ఇనపనూరి కేదారేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇనపనూరి జగదీష్, గృహసారథులు, వలంటీర్లు, సిబ్బంది హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



పాతబస్టాండ్ సెంటర్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌కు బ్రీత్ టెస్ట్ చేస్తున్న సీఐ ఆదిప్రసాద్, డీఎస్పీ శ్రీనివాసులు

ఏలూరు టౌన్: ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో నగరంలోని పలు ప్రాంతాల్లో వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్, ఎస్సైలు ఎస్.రామకృష్ణ, ఎస్‌కే మదిన బాషా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. పాతబస్టాండ్ సెంటర్, వన్‌టౌన్ ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మందిపై కేసులు నమోదుచేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, వేగం వద్దు.. ప్రాణం ముద్దు అనే నినాదంతో సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపటం నేరమన్నారు. మోటారు సైకిల్ ప్రయాణికులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



విద్యానగర్‌లో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): జనసంఘ్ వ్యవస్థాపకులు, బీజేపీ సిద్ధాంతకర్త శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బీజేపీ ఏలూరు పశ్చిమ మండలం ఆధ్వర్యంలో స్థానిక విద్యానగర్‌లో బలిదాన్ దివాస్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పశ్చిమ మండల అధ్యక్షుడు నడపన దానభాస్కరరావు మాట్లాడుతూ ఒకే దేశంలో రెండు విధానాలు సరికాదని, పోరాటం చేసి దేశ సమైక్యత కోసం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. నేటి తరం నాయకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగానే బీజేపీ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేసిందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ముద్దాని దుర్గారావు, జిల్లా కార్యదర్శి ముద్దాని జ్యోతికుమార్, నాయకులు మేకల శ్రీకృష్ణదేవరాయులు, ఇట్టాల కృష్ణారావు, చేకూరి గణపతి, వరప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు అదనపు విధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు, పరిపాలన సౌలభ్యం కోసం అసిస్టెంట్ ఇంజినీర్లు లేని ప్రాంతాల్లో డిప్యూటీ ఈఈలకు అదనపు విధులు కేటాయిస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గోపాలపురం డిప్యూటీ ఈఈకి గోపాలపురం సెక్షన్, పెనుగొండ డిప్యూటీ ఈఈ ఎం.నిరంజన్ బాబుకు పెనుగొండ సెక్షన్, కామవరపుకోట డిప్యూటీ ఈఈ కె.శ్రీనివాసరావుకు కామవరపుకోట సెక్షన్, జంగారెడ్డిగూడెం డిప్యూటీ ఈఈ యు.సుబ్బారావుకు జంగారెడ్డిగూడెం సెక్షన్, జీలుగుమిల్లి డిప్యూటీ ఈఈ టి.వెంకటరావుకు దర్భగూడెం సెక్షన్ ఇన్‌చార్జీలుగా విధులు కేటాయించారు. పాలకొల్లు డిప్యూటీ ఈఈ ఆర్ నాగేశ్వరరావుకు ఆచంట, నల్లజర్ల డిప్యూటీ ఈఈ డి.రాజబాబుకు నల్లజర్ల, భీమడోలు డిప్యూటీ ఈఈ కె.గోపాలకృష్ణకు ఎం.నాగులపల్లి సెక్షన్ ఇన్‌చార్జీలుగా అదనపు విధులు కేటాయించారు. ఏలూరు సర్కిల్ కార్యాలయంలో ఏఈఈగా పని చేస్తున్న ఎస్ పద్మినిని ఏలూరు పవర్‌పేట ఏఈఈగా, పవర్‌పేట ఏఈగా పని చేస్తున్న కె.వెంకటేశ్వరరావును ఏలూరు నార్త్ సెక్షన్ ఏఈగా బదిలీ చేశారు. ఏలూరు కమర్షియల్ -1 డివిజన్ కార్యాలయంలో ఏఈగా పని చేస్తున్న ఆర్. భీమేశ్వరరావును ఎం.నాగులపల్లికి బదిలీ చేసి ఏలూరులో ఆయన చేస్తున్న పాత విధుల్లోనే పని చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు భీమవరం డీపీఈ-2 ఏఈగా పని చేస్తున్న టి.పెద్దిరాజును గత 8 నెలల నుంచి ఖాళీగా ఉన్న తణుకు రూరల్ ఏఈ స్థానానికి బదిలీ చేశారు.

వడ్డీ లేకుండా ఆస్తిపన్ను చెల్లించండి

ఏలూరు టౌన్: ఏలూరు నగర ప్రజలు 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీస్థలాల పన్నులు వడ్డీ లేకుండా చెల్లించేందుకు అవకాశం ఉందని నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. జూన్ 30వ తేదీ లోపు పన్నులు చెల్లిస్తే వడ్డీ ఉండదన్నారు. సెలవు రోజుల్లోనూ ప్రత్యేక కౌంటర్లలో పన్ను చెల్లించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల సొంతింటి కల సాకారం

- చురుగ్గా లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు
- విద్యుత్ లైన్లు, రహదారులు, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు



పోలసానిపల్లి లేఅవుట్‌లో గ్రావెల్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా తదితరులు

భీమడోలు: పోలసానిపల్లి వాసుల 35 ఏళ్ల నాటి సొంతింటి కల సాకారం కానుంది. పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ స్థలాల్లో ఇళ్లను చురుగ్గా నిర్మించుకుంటున్నారు. మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు సొంతింటి జాగా కోసం ఎదురు చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు అర్హులందరికీ ఇళ్లు పథకానికి ఎన్నికల్లో హామీ ఇచ్చి పేదవాడికి సెంటున్నర భూమి ప్రైవేటు భూమి కొనుగోలు చేసి వారికి అందివ్వడమే కాకుండా ఇల్లు నిర్మించుకునేందుకు రూ.1.8 లక్షలతో పాటు ఉపాధి హామీ పథకంలో రూ.28వేల వరకు నిధులు అందించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పట్టుదలతో సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా సహాయ సహకారాలతో గ్రామంలోని మూడు ప్రాంతాల్లో ప్రైవేటు భూమిని కొనుగోలు చేసారు. మూడు లేఅవుట్లలో పేదలైన 187 మందికి పట్టాలను అందించారు. ఆ ప్రాంతాలను అభివృద్ధి చేశారు. పోలసానిపల్లి శివారు గురుకుల కళాశాలకు ఎదురుగా ఉన్న 46 మందికి పట్టాలివ్వగా వారంతా ఇళ్లు నిర్మించుకుంటుకున్నారు. కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి కాస్తున్న నేపథ్యంలో ఆ కాలనీలో సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా పర్యవేక్షణలో గ్రావెల్ రోడ్లు వేశారు. లక్షలాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేసారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఇటీవల ఇంటింటికీ కుళాయి, వీధి లైట్లను ఏర్పాటు చేసారు. నూతన రోడ్ల నిర్మాణ పనుల్లో సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ అంబటి దేవీ నాగేంద్రప్రసాద్, వార్డు సభ్యులు అనంతమ్మ, కోట శ్రీనివాసరావు, నాయకులు కోట శంకర్, సుభాని, రాజేష్, మంచెం నాగేశ్వరరావు, కోట దుర్గారావులు తదితరులు సహకరించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07–10
బెండకాయలు	34	కంద	48
పచ్చిమిర్చి	74–92	బీట్‌రూట్	38
కాకర కాయలు	50	కీరా దోస	44
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	220
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25–45
క్యారెట్	38	పాలకూర	10
దొండకాయలు	26	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణి	--
అనపకాయ (1)	15	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15	చిలకదదుంప	20

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	29
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	21

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	--
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	32
ఏలూరు -తిరుపతి	16.00	4830	29

జూలై 29న దళితసేన మహాసభ

ఏలూరు (టూటౌన్): దళితసేన మూడో వార్షికోత్సవం సందర్భంగా జూలై 29న ఏలూరులో రాష్ట్ర సభలు నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ చెప్పారు. స్థానిక ఆర్ఆర్ పేటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏలూరులో నిర్వహించే రాష్ట్ర సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళిత సేన కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన ప్రజలు హాజరుకావాలని కోరారు. దళిత, వెనుకబడిన వర్గాలకు చెందిన రైతులకు సాగు పట్టాలు మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో దళితసేన నాయకులు లక్కపాము చంటి, పింగళి ఇధియా, పింగుల విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంచి నడవడిక అలవరుచుకోవాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా మంచి నడవడిక అలవరుచుకోవాలని ఏలూరు రైల్వే ఏఎస్సై పి.సైమన్ సూచించారు. ఈ నెల 26న ప్రపంచ మత్తు మందు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు ఉత్తర్వుల మేరకు సైమన్ శుక్రవారం స్థానిక ఏఆర్‌డీజీకే పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నిత్యం పాఠ్యపుస్తకాలతో పాటు న్యూస్ పేపర్లు, మెడిటేషన్ పుస్తకాలు చదవాలని, క్రీడల్లో రాణిస్తూ తల్లిదండ్రులకు ఇంటి పనుల్లో సహాయపడాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వే పోలీసులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు నగరంలో జగన్నాథ రథయాత్ర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈ నెల 25న ఏలూరులో జగన్నథ రథయాత్ర నిర్వహించనున్నట్టు ఇస్కాన్ ఏలూరు శాఖ మేనేజర్ రాధా వల్లభదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు స్థానిక రామకోటి ప్రాంగణం నుంచి మెయిన్ బజారు, పవర్‌పేట, జీఎస్‌టీ రోడ్డు, రామచంద్రరావు పేట, శాతవాహన నగర్‌ల మీదుగా లయన్స్ కల్యాణ మండపం వరకు రథయాత్ర, సాయంత్రం 7.30 గంటల నుంచి లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో పుష్పాభిషేకం, చప్పన్ భోగ కార్యక్రమాలు, పూజ్య లీలా పరాయణ ప్రభు జగన్నాథ లీలా ప్రవచనం కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 8919387849, 9494056101లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సోమవరప్పాడు సచివాలయంలో తనిఖీ

దెందులూరు: మండలంలోని సోమవరప్పాడు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం దెందులూరు మండల ప్రత్యేకాధికారి, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎస్ఎన్ కృపావరం తనిఖీ చేశారు. జగనన్న సురక్ష పథకం అమలు, ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది, హాజరు, సచివాలయంలో సమస్యలు, సమస్యల పెండింగ్, రిజిస్టర్ నిర్వహణ, ఇతర సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, ర్పంచ్ సరిగే నాగరాజు, కార్యదర్శి ముంగర శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విస్తృతంగా మానవత సేవలు



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

గణపవరం: మానవత సేవలు అభినందనీయమని గణపవరం మండల అధ్యక్షుడు అర్ధవరం రాము అన్నారు. శుక్రవారం గణపవరం వర్తక సంఘ భవనంలో గణపవరం మండల మానవత కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మండల మానవత అధ్యక్షుడు వంకాయల రామారావు అధ్యక్షతన నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. మానవత జిల్లా మాజీ అధ్యక్షుడు జానకిరామరాజు, జిల్లా మానవత కెరీర్ గైడెన్స్ చైర్మన్ తాడేపల్లి మోహనరావు, మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, వర్తకసంఘం అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాజు పాల్గొన్నారు. పదో తరగతిలో ప్రతిభచూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేసి, వారిని సన్మానించారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కొఠారు

దెందులూరు: జంగారెడ్డిగూడెం రోడ్డు– సోమవరప్పాడు జగనన్న కాలనీ నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని సోమవరప్పాడు వైఎస్సార్ సీపీ నాయకులు చల్లపల్లి రామకృష్ణ కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి మండలంలోని ప్రజలు వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేసి సమస్యలు వివరించారు. దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘ నాయకులు కాగిత అచ్యుత్‌పూలే, మట్టా రమాశంకర్, ఆరేపల్లి నాగవెంకట శ్రీనివాస్‌గౌడ్, తాతా మురళి మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్డులకిరువైపులా తాటిచెట్లు, ఈతచెట్లు నాటించాలని, కల్లు గీత కార్మికుల పెన్షన్ మంజూరులో నియమ నిబంధనలు మార్పు గౌడ బంధు సంక్షేమ పథకంలో సంవత్సరానికి రూ. 15 వేలు మంజూరు జనాభా ప్రతిపాదికన గౌడ కమ్యూనిటీ గల గ్రామాల్లో గౌడ కల్యాణ మండపాల నిర్మాణాలు చేపట్టాలని వినతిపత్రాలు అందజేశారు. అన్ని సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సిఫార్సు చేశారు.

నేడు డీలర్ల కాటాలు, ఈపోస్ యంత్రాల మరమ్మతులు

దెందులూరు: రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు శనివారం ఉదయం 10 గంటలకు ఏలూరులోని డీఎస్ఓ కార్యాలయంలో తమ ఈ పోస్ యంత్రాలు, కాటాలు తీసుకురావాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ కోరారు. ఏలూరు, పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాల డీలర్లు పనిచేయని ఈపోస్ యంత్రాలు, కాటాలను తీసుకువచ్చి మరమ్మతులు చేయించుకోవాలని రామకృష్ణ కోరారు.